

ఖమ్మంపల్లి ప్రకృతివనంలో నీరులేక ఎండిన చెట్లు



మచ్చుపేట గ్రామంలో డ్రైనేజీ పరిస్థితి

# ఇదేం పాలన..?

- పల్లెల్లో పడకేసిన పారిశుధ్యం
- వీధులన్నీ అధ్వానం
- నీరందక ఎండుతున్న మొక్కలు
- పట్టని స్పెషల్ ఆఫీసర్లు

**పల్లె అధ్వానంగా మారింది. పారిశుధ్యం లోపించి కంపుకొడుతున్నది. వీధుల్లో ఎక్కడపడితే అక్కడ పేరుకున్న చెత్త కుప్పలు, అస్తవ్యస్త డ్రైనేజీలతో కళ తప్పింది. మొన్నటిదాకా పల్లె ప్రగతి, హరిత హారం కార్యక్రమాలతో కళ కళ లాడిన గ్రామాలు, ప్రత్యేకాధికారుల పాలనలో మళ్లీ వెనక్కి వెళ్లిపోయాయి. ఇందుకు పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని పలు ఊళ్లు నిదర్శనంగా నిలుస్తున్నాయి.**

ముత్తారం, ఏప్రిల్ 14: ముత్తారం, మచ్చుపేట, లక్కారం, పారుపల్లిలో పరిశుభ్రత లోపించింది. మురుగుకాలువల్లో సిల్ట్ పేరుకున్నది. ఇన్నాళ్లు స్వచ్ఛతతో కనిపించిన రోడ్లు చెత్తతో రూపు రేఖలు కోల్పోయాయి. ఫలితంగా విష జ్వరాలతో ప్రజలు అల్లాడుతున్నారు. ఖమ్మంపల్లిలోని పల్లె ప్రకృతి వనంలో నీళ్లు లేక మొక్కలన్నీ ఎండిపోయి పాదులు తేలాయి. ఇంత జరుగుతున్నా పట్టని ప్రత్యేకాధికారుల తీరుపై ప్రజలు మండిపడుతున్నారు. మొత్తం 14 గ్రామ పంచాయతీలకు తొమ్మిది మంది ప్రత్యేకాధికారులను నియమించారని, వారు ఎప్పుడు వస్తున్నారో.. వెళ్తున్నారో..? తెలియని పరిస్థితి నెలకొన్నదని ప్రజలు వాపోతున్నారు. కాగా, ఈ విషయమై మండల ప్రత్యేకాధికారి ప్రవీణ్ కుమార్‌రెడ్డి వివరణ కోరగా, త్వరలోనే స్పెషల్ డ్రైవ్ నిర్వహించి డ్రైనేజీ వ్యవస్థను పునరుద్ధరిస్తామని, పారిశుధ్యాన్ని మెరుగుపరుస్తామని చెప్పారు. ఇంకా ప్రత్యేకాధికారులు అందుబాటులో ఉండేలా ఆదేశాలు జారీ చేస్తామని తెలిపారు. ఇంకా గ్రామాల్లో ఎలాంటి సమస్యలున్నా కార్యదర్శి లేదంటే, ప్రత్యేకాధికారి గానీ తనను సంప్రదించాలని సూచించారు.



పారుపల్లి పాత గ్రామపంచాయతీ వద్ద చెత్తాచెదారం

## దేశాయిపేట రైస్‌మిల్లులో
# కాలి బూడిదైన ధాన్యం

- రూ.3.30 కోట్ల ఆస్తి నష్టం



రైస్ మిల్లును పరిశీలిస్తున్న ఎస్ఐ శ్యామ్‌రాజ్

మేడిపల్లి, ఏప్రిల్ 14: భీమారం మండలం దేశాయిపేట శివారులోని విఘ్నేశ్వర పారాబాయిల్డ్ రైస్ మిల్లులో ప్రమాదవశాత్తూ ఆదివారం జరిగిన అగ్నిప్రమాదంలో భారీ నష్టం వాటిల్లింది. యజమాని సింగిరెడ్డి జనార్ధన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. రైస్ మిల్లు నుంచి ఆదివారం తెల్లవారుజామున పొగలు వస్తున్నాయని స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు వచ్చి చూడగా అప్పటికే మంటలు భారీగా చెలరేగాయి. వెంటనే ఫైర్ సిబ్బంది వచ్చి మంటలు ఆర్పినప్పటికీ అప్పటికే 22 వేల క్వింటాళ్ల ధాన్యం, 20 వేల ఖాళీ గన్నీ సంచులు కాలిబూడిదైనట్లు చెప్పాడు. దాదాపుగా రూ.3 కోట్ల 30 లక్షల ఆస్తి నష్టం జరిగిందని తెలిపారు. జనార్ధన్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్యామ్‌రాజ్ తెలిపారు.



మంథని ప్రాంతంలో పట్టుకున్న రేషన్ బియ్యం

### సంచులు మార్చకుండానే..

.. ఈ ఫొటోలో కనిపిస్తున్న వాహనంలో రేషన్ బియ్యం ఉన్నాయి. మంథని మండలంలోని నిరుపేదల కోసం కేటాయించిన ఈ రైస్‌ను ఎంఎల్ఎల్ పాయింట్ల నుంచి రేషన్ షాపులకు చేరిన తర్వాత లబ్ధిదారులకు పంచాలి. కానీ, ఈ నెల 9న మంచిర్యాలకు తరలిస్తుండగా మంథనిలోనే ప్రధాన రహదారిపై పోలీసులు పట్టుకున్నారు. ప్రభుత్వ సంచుల్లోనే పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తుండడాన్ని చూసి అధికారులు విస్తుపోయారు. ఈ రైస్ నేరుగా రేషన్ దుకాణం నుంచే బయటికి రావడం దందా ఏ స్థాయిలో నడుస్తుందో చెప్పేందుకు నిదర్శనంగా నిలుస్తున్నది.

# రేషన్ బియ్యం పక్కదారి

- ఇతర రాష్ట్రాలకు రైస్
- గుట్టుచప్పుడు కాకుండా తరలింపు
- రెచ్చిపోతున్న అక్రమార్కులు
- రోడ్డు, రైల్వే మార్గాల ద్వారా మంచిర్యాల, మహారాష్ట్రకు రవాణా
- పలు రైస్‌మిల్లుల్లోనూ రీసైక్లింగ్ వ్యాపారం
- డీలర్ల సహకారంతో నేరుగా రేషన్ షాప్‌ల నుంచే డంపింగ్
- దాడులు చేస్తున్నా కట్టడి చేయలేకపోతున్న యంత్రాంగం
- శాఖల మధ్య సమన్వయలోపమే కారణం

**రేషన్ బియ్యం పక్కదారి పడుతున్నది. గుట్టుచప్పుడు కాకుండా ఇతర రాష్ట్రాలకు తరలుతున్నది. ఈ దందా అక్రమార్కులకు కాసుల వర్షం కురిపిస్తున్నది. లబ్ధిదారుల నుంచి తక్కువ రేట్‌కే రావడం, మార్కెట్లో మంచి డిమాండ్ ఉండడంతో ఈ వ్యాపారం మూడుపువ్వులు ఆరుకాయలుగా నడుస్తున్నది. కొందరు ఇల్లిల్లూ తిరుగుతూ రైస్‌ను సేకరిస్తుండగా, మరికొందరు డీలర్ల సహకారంతో నేరుగా రేషన్ దుకాణాల నుంచే దారి మళ్లిస్తుండడం విస్తుగొలుపుతున్నది. అధికారులు దాడులు చేస్తున్నా, పూర్తి కట్టడిలో మాత్రం శాఖల మధ్య సమన్వయ లోపాన్ని కండ్లకుగడుతున్నది.**



పెద్దపల్లి, ఏప్రిల్ 14(నమస్తే తెలంగాణ): పేదల ఆకలి తీర్చేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న చౌక ధరల బియ్యం అక్రమార్కులకు వరంగా మారింది. పెద్దపల్లి జిల్లాలో ప్రతి నెలా ఈ అక్రమ దందా జోరుగా సాగుతున్నది. పెద్దపల్లి, సుల్తానాబాద్, కాల్వశ్రీరాంపూర్, ఓదెల, జూలపల్లి, ఎలిగేడు మండలాల్లో కేవలం ఇద్దరు వ్యక్తులే ఈ దందాను జోరుగా సాగిస్తున్నట్లు తెలిసింది. పీడీఎస్ బియ్యాన్ని సేకరించి, వాటిని సుల్తానాబాద్‌లోని మిల్లుల్లో రీసైక్లింగ్ చేసి మహారాష్ట్రలోని గోండియాకు తరలిస్తున్నట్లు సమాచారం. మంథనిలో ముగ్గురు అక్రమార్కులు గ్రామాల నుంచి సేకరిస్తూ హద్దులు దాటిస్తున్నట్లు తెలిసింది. ఇక రామగిరి మండలానికి చెందిన మరోవ్యక్తి ముత్తారం, కమాన్‌పూర్ మండలాల నుంచి బియ్యాన్ని సేకరించడంలో కీలకంగా వ్యవహరిస్తున్నట్లు స్థానికంగా చర్చ జరుగుతోంది. మంథని పట్టణానికి చెందిన ఓ అక్రమార్కుడు జయశంకర్ భూపాలపల్లి జిల్లా పరిధిలోని కాటారం, మహాముత్తారం, మల్హార్, పలిమెల, మహదేవ్‌పూర్ మండలాల నుంచి సేకరిస్తూ మహారాష్ట్రకు తరలిస్తూ రూ.కోట్లు గడిస్తున్నట్లు తెలిసింది. స్థానిక ప్రజాప్రతినిధుల అండదండలతోనే అక్రమార్కులు రెచ్చిపోతుండగా, విషయం తెలిసినా యంత్రాంగం కట్టడి చేయకపోవడంపై ప్రజలు మండిపడుతున్నారు.



.. ఈ ఫొటోలో కనిపిస్తున్న వాహనాన్ని మంథని నుంచి గోదావరిఖని వైపు రేషన్ బియ్యం తరలిస్తుండగా మంథని బస్సు డిపో వద్ద పట్టణానికి చెందిన ఒక కాంగ్రెస్ నాయకుడు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. ఈ ట్రాలీలో దాదాపుగా 30 క్వింటాళ్ల బియ్యపు సంచులు ఉన్నాయి. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### లాభసాటి వ్యాపారం..

రేషన్ బియ్యం రీసైక్లింగ్ పలువురు అక్రమార్కులకు లాభసాటి వ్యాపారంగా మారింది. దీంతో పలువురు మిల్లర్లు తమ అక్రమ దందా బాగోతం బయటపడకుండా చాలా తెలివిగా వ్యవహరిస్తున్నారు. రేషన్ దుకాణాల నుంచి దొడ్డిదారిన వచ్చిన బియ్యాన్ని ఆగమేఘాలపై ప్రభుత్వ సంచుల్లోకి (ఎఫ్‌సీఐ సంచుల్లోకి) మార్చేయడంతోపాటు రికార్డులను తారుమారు చేస్తున్నారు. లబ్ధిదారుల నుంచి సేకరించిన బియ్యాన్ని తిరిగి సీఎంఆర్ కింద ప్రభుత్వానికే అమ్ముతూ కోట్లు సంపాదిస్తున్నారు. ఒక్కప్పుడు జిల్లాలో 30శాతం జరిగిన రీసైక్లింగ్ దందా నేడు రెట్టింపులోకి చేరడమే ఇందుకు నిదర్శనంగా కనిపిస్తున్నది. అయితే బియ్యం అక్రమ తరలింపును అడ్డుకోవాల్సిన రెవెన్యూ, పౌరసరఫరాల అధికారులు, పోలీసుశాఖల మధ్య సమన్వయం లేకపోవడం వల్లే అక్రమార్కులకు కలిసివస్తోంది.

### దందాకు అడ్డాలుగా రేషన్ దుకాణాలు

జిల్లాలో ప్రధానంగా దందా రెండు రకాలుగా జరుగుతున్నది. ఒకటి లబ్ధిదారుల నుంచి బియ్యాన్ని ఇంటింటికీ తిరిగి కొంత మంది సేకరిస్తుండగా, రెండోది రేషన్ దుకాణాల నుంచే పక్కదారి పట్టించడం. ఇందులో రేషన్ డీలర్లు లబ్ధిదారుల వేలిముద్రలు తీసుకొని, వారికి బియ్యం బదులు డబ్బులు ఇస్తూ, బియ్యాన్ని అక్రమార్కులకు అమ్మేస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల అధికారులు పలు రేషన్ దుకాణాల్లో జరిపిన తనిఖీల్లో కేటాయించిన బియ్యం నిల్వలు, పంపిణీకి మధ్య భారీ వ్యత్యాసాలు ఉండడమే నిదర్శనంగా నిలుస్తున్నది. ఈ క్రమంలో డీలర్లకు నోటీసులు కూడా జారీ చేశారు.

### దాడులు ఉధృతం చేస్తున్నాం..



జిల్లాలో రేషన్ బియ్యం అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతున్నాం. దాడులు ఉధృతంగా చేస్తున్నాం. టాస్క్‌ఫోర్స్ సిబ్బందితో ఎప్పటికప్పుడు తనిఖీలు చేయిస్తున్నాం. జనవరి నుంచి ఇప్పటివరకు 349.75 క్వింటాళ్ల రైస్‌ను పట్టుకొని 56 మందిని అరెస్ట్ చేశాం. బియ్యం పక్కదారి పట్టిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తున్నాం. దీనికి పూర్తిగా చెక్‌పెట్టేందుకు ఇప్పుడున్న సిబ్బందికి అదనంగా గ్రామం నుంచి డివిజన్ స్థాయి దాకా బృందాలను ఏర్పాటు చేస్తున్నాం.

**- ప్రేంకుమార్, డీఎస్‌వో పెద్దపల్లి**



కరీంనగర్ : అంబేద్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి బీ వినోద్‌కుమార్, జడ్పీ చైర్‌పర్సన్, ఇతర నాయకులు


# అంబేద్కర్ ఆశయాలను కొనసాగిస్తాం

- బీఆర్ఎస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్

కరీంనగర్ కార్పొరేషన్, ఏప్రిల్ 14 : అంబేద్కర్ ఆశయాలను కొనసాగించేందుకు అన్ని వేళల్లో కృషి చేస్తామని బీఆర్ఎస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ స్పష్టం చేశారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా స్థానిక కోర్టు చౌరస్తాలోని ఆయన విగ్రహం, చిత్రపటానికి ఎమ్మెల్యే గంగుల కమలాకర్, జడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, నగర మేయర్ యాదగిరి సునీల్‌రావుతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వినోద్‌కుమార్ మాట్లాడుతూ దేశం సమైక్యంగా ఉందంటే అది అంబేద్కర్ వల్లేనని పేర్కొన్నారు. రాజ్యాంగాన్ని సవరించి పెద్ద ఎత్తున మార్పులు చేస్తామని బీజేపీ చెప్పడం సరికాదని, రాజ్యాంగాన్ని పరిరక్షించాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. అంబేద్కర్ స్ఫూర్తిని కొనసాగిస్తామని చెప్పారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 3 వల్లే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైందని తెలిపారు. బీఆర్ఎస్ ముందు నుంచి అంబేద్కర్‌కు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి పనులు చేపడుతుందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, కార్పొరేటర్లు కంసాల శ్రీనివాస్, మెండి శ్రీలత చంద్రశేఖర్, సరిళ్ల ప్రసాద్, గంట కళ్యాణి, తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ అందరివాడు

- ఆయన స్ఫూర్తితోనే రాష్ట్ర కల సాకారం
- పెద్దపల్లి బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్



గోదావరిఖనిలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న బీఆర్ఎస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల, మాజీ ఎమ్మెల్యే చందర్

కోల్‌సిటీ, ఏప్రిల్ 14: 'రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ఏ ఒక్క వర్గానికి చెందిన వ్యక్తి కాదు. ఆయన అందరివాడు. ఆయన పోరాట స్ఫూర్తితోనే లక్షలాది మందిని సమీకరించి 14 ఏండ్లపాటు పోరాడి కేసీఆర్ నాయకత్వం లో రాష్ట్రాన్ని సాధించుకున్నాం.' అని పెద్దపల్లి బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ ఉద్ఘాటించారు. అంబేద్కర్ జయంతి పురస్కరించుకొని రామగుండం మున్సిపల్ కార్యాలయం టీ జంక్షన్ వద్ద నిర్వహించిన వేడుకల్లో స్థానిక మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌తో కలిసి పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కొప్పుల మాట్లాడారు. బీ ఆర్ఎస్ హయాంలోనే ప్రపంచంలో నే అతిపెద్ద 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని హైదరాబాద్‌లో ఏర్పాటు చేసి ఆయన్ను గౌరవించుకున్నామనీ, సచివాలయానికి బాబాసాహెబ్ పేరు పెట్టిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. బడుగు, బలహీనవర్గాలు, దళిత గిరిజన వర్గాల కోసం కేసీఆర్ ప్రభుత్వం అంబేద్కర్ అడుగుజాడల్లో నడిచిందన్నారు. రాజ్యాంగం ఇచ్చిన హక్కులతోనే దేశంలో ప్రతి పౌరుడు స్వేచ్ఛగా తిరుగగలుగుతున్నాడని, కానీ బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని తమకు అనుకూలంగా మార్చేందుకు కుట్ర చేస్తున్నదని దుయ్యబట్టారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం పోరాడేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలని, లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని పిలుపునిచ్చారు. అంతకు ముందు ప్రధాన చౌరస్తాలోని పార్టీ కార్యాలయంలో అంబేద్కర్ జయంతి వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మిర్యాల రాజిరెడ్డి, పెంట రాజేశ్, బొడ్డు రవీందర్, డా.వాసంపల్లి ఆనంద్ బాబు, గడ్డి సరోజన, జేవి రాజు, మురళీధర్ రావు, నూనె కొంర య్య, సీహెచ్ మొగిలి, దేవరాజ్, పర్లపల్లి రవి, తోడేటి శంకర్ గౌడ్, మారుతి, పిల్లి రమేశ్, బొడ్డుపల్లి శ్రీనివాస్, వడ్డెపల్లి శంకర్, నూతి తిరుపతి, అచ్చ వేణు, ఈదునూరి నర్సింగ్, నీరటి శ్రీనివాస్, చింటు, శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

## వడ్డీ వ్యాపారుల ఇండ్లల్లో
# కొనసాగిన సోదాలు

- కిలోన్నర బంగారం, రూ.7 లక్షల నగదు సీజ్



నగదు, ప్రామిసరీ నోట్లతో పాటు బంగారాన్ని చూపుతున్న పోలీసులు

మారుతీనగర్, ఏప్రిల్ 14 : మెట్‌పల్లిలోని పలువురు వడ్డీ వ్యాపారుల ఇండ్లలో పోలీసుల సోదాలు శనివారం అర్ధరాత్రి వరకు కొనసాగాయి. పట్టణానికి చెందిన కట్కం రమేశ్ లైసెన్స్ ముగిసినప్పటికీ కట్కం బ్రదర్స్ పేరున వడ్డీ వ్యాపారం చేస్తూ బంగారాన్ని తాకట్టు పెట్టుకొని అధిక వడ్డీలు వసూలు చేస్తున్నాడనే పక్కా సమాచారంతో ఎస్‌బీ డీఎస్పీ రవీంద్ర కుమార్ పర్యవేక్షణలో దాడులు నిర్వహించినట్లు ఎస్ఐ చిరంజీవి తెలిపారు. ఈ మేరకు కట్కం ప్రకాశ్, తమ్ముడు రమేశ్, కొడుకులు కట్కం శివ, కట్కం కార్తీక్ వద్ద రూ.70 లక్షల విలువైన కిలోన్నర బంగారం, రూ.7 లక్షల నగదు, 13 ప్రామిసరీ నోట్లను స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెల్లడించారు.

# ధర్మపురి వాసికి జాతీయ పురస్కారం



ధర్మపురి వాసి నరేందర్‌ను సన్మానిస్తున్న సాహిత వేదిక నిర్వాహకులు

ధర్మపురి, ఏప్రిల్14 : ధర్మపురికి చెందిన కట్కం నరేందర్ అనే ఉపాధ్యాయుడికి మహానంది జాతీ య పురస్కారం లభించింది. అంబేద్కర్ జ యంతి సందర్భంగా హైదరాబాద్ చిక్కడపల్లిలోని శ్రీ త్యాగరాజ గాన సభ, కళావెంకట దీక్షితులు కళావేదికపై తెలుగు వెలుగు సా హితీ వేదిక స్వ చ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఉగాది జాతీయ పురస్కారాల ప్రధానోత్సవ కార్యక్రమం జరిగింది. ధర్మపురికి చెందిన నరేందర్ రచించిన ''ఓ అంబేద్కరా మీకు పోటీ ఎవరు?''అనే పాట ను తెలుగువెలుగు సాహితీ వేదిక స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు పురస్కారానికి ఎంపిక చేశారు. పురస్కారం అందుకున్న నరేందర్‌ను ఈసందర్భంగా పలువురు అభినందించారు.

# నిర్లక్ష్యపు ఉద్యోగులపై చర్యలేవి?

- కొండగట్టు దుకాణాల లీజు నిధుల గోల్‌మాల్ వ్యవహారంలో ఉన్నతాధికారుల రివర్స్‌గేర్
- ఈవో మినహా మిగతావారిపై చర్యలు శూన్యం
- కమిషనర్ ఆదేశించినా పట్టని వైనం

**కొండగట్టు ఆలయ దుకాణాల లీజుకు సంబంధించిన డబ్బుల గోల్‌మాల్ వ్యవహారం, విధుల్లో నిర్లక్ష్యం చూపిన ఉద్యోగులపై చర్యలకు ఉన్నతాధికారులు వెనుకడుగు వేశారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈవో మినహా మిగతా వారిపై ఎలాంటి చర్యలూ లేకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.**



కొండగట్టు అంజన్న ఆలయంలో రికార్డులను పరిశీలిస్తున్న అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్,సిబ్బంది ( ఫైల్ )

మల్యాల, ఏప్రిల్ 14 : షాపుల లీజు వసూలు వ్యవహారంపై గత నెల 18న 'కొండగట్టు లీజులో గోల్‌మాల్' శీర్షికన 'నమస్తే తెలంగాణ' మెయిన్‌లో కథనం ప్రచురితం కావడంతో దేవాదాయ, ధర్మాదాయ శాఖ కమిషనర్ హన్మంతరావు స్పందించి విచారణకు ఆదేశించారు. దేవాదాయ శాఖ అదనపు కమిషనర్ జ్యోతి, అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్ 19న కొండగట్టుకు చేరుకొని, కార్యాలయంలోని లీజుకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. నగదు వ్యవహారాల్లో రికార్డులు సరిగా లేకపోవడం, ఈవో పర్యవేక్షణా లోపంతోనే లీజు ద్వారా వచ్చిన నగదును ఆలయ ఖాతాల్లో జమ చేయలేదని, పక్కదారి పట్టినట్లు నిర్ధారించారు. కొన్నేళ్లు ఉన్న ఆడిట్ అభ్యంతరాలను సైతం పరిశీలించకపోవడం, రీకాన్సిలేషన్ చేయకపోవడంలో ఈవో నిర్లక్ష్యం చూపారని ప్రాథమికంగా తేల్చి, దేవాదాయ శాఖ కమిషనర్‌కు 22న నివేదిక అందజేశారు. ఆలయ పద్దు పుస్తకాల నిర్వహణ, పర్యవేక్షణ లోపభూయిష్టంగా ఉండడం వల్లే సిబ్బంది నగదు విషయంలో ఇష్టారాజ్యంగా వ్యవహరించారనే కారణంతో గత నెల 23న ఈవో టంకశాల వెంకటేశ్‌ను సస్పెండ్ చేయడంతోపాటు కరీంనగర్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌కు కొండగట్టు ఈవోగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ దేవాదాయ ధర్మాధాయ శాఖ కమిషనర్ ఉత్తర్వులు ఇచ్చారు. అలాగే, పక్కదారి పట్టిన ₹81,56,950కు సంబంధించి ఆలయ పద్దు పుస్తకాల నిర్వహణ, పర్యవేక్షణాలోపం నిర్లక్ష్యంపై టెండర్ సెక్షన్ ఇన్‌చార్జితోపాటు సంబంధిత సెక్షన్ పర్యవేక్షకుడు, ఏఈవోపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని అదే రోజు ఉత్తర్వులు జారీ చేశారు. అయినా, ఆలయ అధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈవో స్థాయి అధికారిపైన వేటు వేసినా.. కింది స్థాయి ఉద్యోగులపై చర్యలెందుకు తీసుకోవడం లేదనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. దీనిపై అనేక అనుమానాలు తలెత్తుతున్నాయి.



కొండగట్టు అంజన్న కార్యాలయ రికార్డులను హైదరాబాద్‌కు తీసుకెళ్తున్న సిబ్బంది (ఫైల్ )

### కమిషనర్ ఆదేశాలు పాటిస్తాం



ఇటీవలే కొండగట్టు ఈవోగా అదనపు బాధ్యతలు స్వీకరించా. రికార్డులు పరిశీలిస్తున్నాం. దేవాదాయ కమిషనర్ ఆదేశాలను రెండు మూడు రోజుల్లో అమలు చేస్తాం. నిధుల గోల్‌మాల్‌కు సంబంధించి విధుల్లో నిర్లక్ష్యం చూపిన ఉద్యోగులపై చర్యలు తీసుకుంటాం.

**- చంద్రశేఖర్, ఆలయ ఈవో, కొండగట్టు దేవస్థానం**

## సర్కారు దవాఖానల్లో
# సేవలు మృగ్యం

- మూడు నెలలుగా తగ్గుతున్న ప్రసవాలు
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సిబ్బంది
- కేసీఆర్ కిట్‌కు మంగళం
- పట్టించుకోని అధికారగణం




మెట్‌పల్లి దవాఖాన

**కేసీఆర్ పాలనలో ప్రజలకు మెరుగైన వైద్యం అందించిన మెట్‌పల్లి సామాజిక దవాఖానలో ప్రస్తుత కాంగ్రెస్ మూడు నెలల పాలనలోనే మృగ్యమయ్యాయి. అప్పటి సర్కారు కేసీఆర్ కిట్లను ప్రవేశపెట్టడం, సకల సౌకర్యాలు కల్పించడంతో ప్రతినెలా ప్రసవాల కోసం వచ్చే గర్భిణులతో కళ కళ లాడేది. కానీ, ఇప్పటి సర్కారు వైద్య సేవలందించడం, వసతుల కల్పనలో నిర్లక్ష్యం, కేసీఆర్ కిట్లకు మంగళం పాడడంతో ప్రసవాల సంఖ్య గణనీయంగా తగ్గిపోతున్నది. వెరసి మెట్‌పల్లి ప్రభుత్వ వైద్యశాలలో మళ్లీ ఉమ్మడి రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులు రావడం ఆందోళన కలిగిస్తున్నది.**

**-మెట్‌పల్లి, ఏప్రిల్ 14**



CHC METPALLY 2023

| S.N | MONTH | TOTAL | NORMAL | LSCS |
|---|---|---|---|---|
| 1 | Apr-23 | 99 | 29 | 70 |
| 2 | May-23 | 118 | 33 | 85 |
| 3 | Jun-23 | 109 | 30 | 79 |
| 4 | Jul-23 | 123 | 28 | 95 |
| 5 | Aug-23 | 121 | 37 | 84 |
| 6 | Sep-23 | 121 | 45 | 76 |
| 7 | Oct-23 | 132 | 43 | 89 |
| 8 | Nov-23 | 91 | 24 | 67 |
| 9 | Dec-23 | 116 | 26 | 90 |
| 10 | Jan-24 | 93 | 26 | 67 |
| 11 | Feb-24 | 92 | 28 | 64 |
| 12 | Mar-24 | 101 | 18 | 83 |
| | | 1316 | 367 | 949 |

ప్రసవాల పట్టిక

తెలంగాణ ఏర్పాటు తర్వాత కేసీఆర్ ప్రభుత్వం సర్కారు దవాఖానల అభివృద్ధిపై దృష్టిపెట్టింది. నిరుపేదలకు మెరుగైన సేవలందించేందుకు విరివిగా నిధులు వెచ్చించి మౌలిక వసతులు కల్పించింది. వైద్యులు, సిబ్బందిని నియమించి 24 గంటలు సేవలందించింది. ప్రసవాల సంఖ్య పెంపునకు తెచ్చిన కేసీఆర్ కిట్ పథకం సత్ఫలితాలనిచ్చింది. అయితే నాలుగు నెలల క్రితం అధికారం చేపట్టిన రేవంత్ సర్కారు ప్రభుత్వ వైద్యంపై అలక్ష్యం చేస్తున్నది. ఇటీవల కాలంలో దవాఖానలో నమోదైన ప్రసవాల సంఖ్యను చూస్తే వచ్చిన 'మార్పు' ఇట్టే అవగతమవుతున్నది. గడిచిన జనవరి, ఫిబ్రవరి నెలలో నమోదైన ప్రసవాల సంఖ్య రెండంకెలు దాటలేదు. 2023 జనవరిలో 130, ఫిబ్రవరిలో 129, మార్చిలో 116, ఏప్రిల్‌లో 99, మేలో 118, జూన్‌లో 109, జులైలో 123, ఆగస్టులో 121, సెప్టెంబర్‌లో 121, అక్టోబర్‌లో 132, నవంబర్‌లో 91, డిసెంబర్‌లో 116 ప్రసవాలు జరగగా ఏప్రిల్, నవంబర్ నెలలో వందలోపు మాత్రమే ప్రసవాలు జరిగాయి. ఈ ఏడాది జనవరిలో 93, ఫిబ్రవరిలో 92, మార్చిలో 101 ప్రసవాలు జరిగాయి. గతేడాదిలో జరిగిన ప్రసవాలు, ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి, మార్చిలో జరిగిన ప్రసవాల సంఖ్యను పోల్చి చూస్తే మూడు నెలల్లో ప్రసవాల సంఖ్య తగ్గుముఖం పడుతున్నట్లు స్పష్టమవుతున్నది. నమోదైన ప్రసవాల సంఖ్యను బట్టి చూస్తే ప్రభుత్వ దవాఖాన ప్రజల ఆదరణను కోల్పోతుందా? లేదా ప్రసవాలపై సరైన అవగాహన కల్పించడంలో గాని, గర్భిణులను దవాఖాన వరకు తీసుకరావడంలో గాని, వచ్చిన గర్భిణులకు సరైన వైద్య సేవలు అందించడంలో గాని, వసతుల కల్పనలో సంబంధిత యంత్రాంగం విఫలమవుతుందా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. దవాఖానలో గైనకాలజిస్టులు ముగ్గురికి గాను ఒకరికి కాంట్రాక్ట్ గడువు ముగియడంతో కొంత కాలంగా ఇద్దరు మాత్రమే పనిచేస్తున్నారు. ఏది ఏమైనా ప్రభుత్వం స్పందించి ప్రసవాల సంఖ్యను పెంపుపై దృష్టిపెట్టాలని ప్రజలు కోరుతున్నారు.